ప్రజాశక్తి
శుక్రవారం 28 మార్చి 2025
5
విజయనగరం

సిజిఎస్‌టి అధికారిగా బాడంగి యువకుడు

ప్రజాశక్తి-బాడంగి

అభిలాష్

బాడంగి గ్రామానికి చెందిన యువకుడు వంగపండు అభిలాష్ సెంట్రల్ జిఎస్‌టి అధికారిగా ఎంపికయ్యాడు. వంగపండు శ్రీనివాసు, వెంకటలక్ష్మి దంపతుల మొదటి కుమారుడు అభిలాష్. ఇటీవల జరిగిన కంబైండ్ గ్రాడ్యుయేట్ లెవెల్ ఎగ్జామినేషన్‌లో 390 మార్కులకు గాను 354 మార్కులు సాధించి అల్ ఇండియా ఒబిసి కేటగిరిలో 640 ర్యాంకు సాధించి సెంట్రల్ జిఎస్‌టి అధికారిగా ఎంపికయ్యారు. అభిలాష్ ఐఐటి ఖరగ్‌పూర్‌లో బిటెక్, ఎంటెక్ పూర్తిచేశారు. అభిలాష్ తండ్రి శ్రీనివాసు వ్యాపారం చేస్తుండగా, తల్లి వెంకటలక్ష్మి బాడంగి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు.

235 పాఠశాలలు మూత?

- ప్రాథమిక పాఠశాలల మెడపై 117 జిఒ కత్తి
- ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసే కుట్ర
- తల్లిదండ్రులను ఒప్పించే బాధ్యతను ఎమ్మెల్యేలకు అప్పగించిన ప్రభుత్వం

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం విద్యాశాఖలో 117 జీవో రద్దు పేరుతో ప్రాథమిక పాఠశాలలను కుదించే ప్రయత్నం చేస్తోంది. గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ జీవోతో పలు పాఠశాలలు మూతపడిన విషయం తెలిసిందే. తాము అధికారంలోకి వస్తే ఆ జీవోను రద్దు చేసి పాఠశాలలను తెరిపిస్తామని చంద్రబాబు ప్రకటించారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత 117 జీవోను రద్దు చేస్తున్నట్లు ప్రకటించి దొడ్డిదారిన అవే విధానాలు అమలు చేసి పాఠశాలల మూసివేతకు రంగం సిద్ధం చేస్తున్నారు. దీంతో జిల్లా అంతటా విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

గత ప్రభుత్వ హయాంలో జీవో 117 అమలు ద్వారా 1 నుంచి 5వ తరగతి వరకు ఉండే ప్రాథమిక పాఠశాలల్లో 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. ఫలితంగా పలు పాఠశాలలు మూతపడి పేద విద్యార్థులు ప్రభుత్వ బడులకు దూరమయ్యారు. తాజాగా టిడిపి కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన విధానం ద్వారా పంచాయతీకొక మోడల్ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేసి సమీపంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఉన్న 3,4,5 తరగతులను విలీనం చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. గ్రామాల్లో వున్న ప్రాథమిక పాఠశాలలను ఫౌండేషన్ పాఠశాలలుగా మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది. 1,2 తరగతులతో ఫౌండేషన్ పాఠశాలలు ఏర్పాటు చేయడం ద్వారా భవిష్యత్తులో గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు కనుమరుగయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ లెక్కన విజయనగరం జిల్లాలో సుమారు 235కు పైగా యుపి పాఠశాలలను ఎత్తివేసేందుకు అవకాశముంది. ప్రస్తుతం జిల్లాలో 1 నుంచి 5 వరకు నడిచే ప్రాథమిక పాఠశాలలు 1718 ఉన్నాయి. వీటిని విచ్ఛిన్నం చేయడం ద్వారా సుమారు 1482 మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేయనున్నారు. పంచాయతీ కొక మోడల్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేసి అక్కడ తరగతికొక ఉపాధ్యాయుడ్ని నియమిస్తామని ప్రభుత్వం చెబుతోంది.

దీనివల్ల ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య గణనీయంగా తగ్గిపోనున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలలకు, మోడల్ ప్రాథమిక పాఠశాలలకు సర్దుబాటు చేస్తామని చెబుతోంది. మోడల్ ప్రాథమిక పాఠశాలలకు వెళ్లే 3,4,5 తరగతుల విద్యార్థులు కనీసం 3 నుంచి 5 కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సి ఉంటుంది. ఈ కారణాల రీత్యా పిల్లలను తల్లిదండ్రులు మోడల్ ప్రాథమిక పాఠశాలకు పంపించే అవకాశంలేదు. ప్రయాణ భత్యం ఇస్తామని చెపుతున్నా అది ఆచరణలో ఎంతవరకు అమలవుతుందనేది ప్రశ్నార్థకంగా వుంది.

ఎమ్మెల్యేలకు బాధ్యత అప్పగించిన ప్రభుత్వం

మరో వైపు మోడల్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు వల్ల నష్టం కలుగుతుందని, తమ పిల్లలు పాఠశాల విద్యకు దూరమవుతారని ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ప్రజలను ఒప్పించే బాధ్యతను ఎమ్మెల్యేలకు ప్రభుత్వం అప్పగించింది. ఎమ్మెల్యేలు ద్వారా లేఖలు తీసుకొని మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా మార్చే ప్రయత్నం చేపడుతోంది. అయితే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యేలు కూడా మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేయాలని విద్యా శాఖకు సిఫార్సు చేయడం లేదు.

అప్రమత్తం కాకుంటే తీవ్ర నష్టం

ప్రభుత్వాలు ప్రాథమిక విద్యను బలోపేతం చేయకుండా పాఠశాల విద్యను అభివృద్ధి చేయలేవు. ఏ ప్రభుత్వం వచ్చినా పాఠశాలలను, ఉపాధ్యాయుల సంఖ్య ఎలా తగ్గించాలి? అనే ఆలోచిస్తున్నాయి తప్ప పాఠశాలల అభివృద్ధికి తీసుకునే చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. హైస్కూల్స్ నుంచి వేరు చేస్తున్న మూడు నాలుగు ఐదు తరగతుల విద్యార్థులు నేరుగా వచ్చి ప్రభుత్వ పాఠశాలలో చేరుతారా? లేదా అందుబాటులో ఉన్న ప్రైవేట్ స్కూల్స్ లో చేరుతారా అనేది కూడా ప్రశ్నార్థకం మారింది.

ప్రాథమిక పాఠశాలలను కొనసాగించాలి

ప్రభుత్వం 117 జిఒను రద్దు చేస్తూ, భవిష్యత్తులో పాఠశాల విద్య కోలుకోలేని విధంగా చర్యలు తీసుకోవడం బాధాకరం. ప్రాథమిక పాఠశాలలను కొనసాగిస్తూనే ప్రతి పంచాయతీలో మోడల్ ప్రైమరీ పాఠశాలలను అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేయాలి. హైస్కూళ్లలో తెలుగు, ఇంగ్లీష్ రెండు మీడియంలు కొనసాగించాలి. ప్రాథమికోన్నత పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలి. వాటి అభివృద్ధికి చర్యలు తీసుకుంటూ భవిష్యత్తులో వాటిని హైస్కూల్స్ గా అప్‌గ్రేడ్ చేయాలి. హైస్కూల్స్ లో ఏర్పాటు చేసిన ప్లస్ టు కొనసాగించాలి.

- డి.రాము, యుటిఎఫ్ రాష్ట్ర విద్యా విషయక అధ్యయన కమిటీ సభ్యులు

పల్లె నిద్రలో భాగంగా గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ

పల్లెనిద్రతో ప్రజలతో మమేకం

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో పోలీసుశాఖ చేపట్టిన పల్లెనిద్ర కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోందని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. పల్లెనిద్ర చేస్తూ, గ్రామస్థులతో మమేకమవుతూ వారి సమస్యలను విని, క్షేత్ర స్థాయిలో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. జిల్లా అంతటా పోలీసు అధికారులు గురువారం పల్లెనిద్ర చేపట్టారు. జిల్లాలో వివిధ గ్రామాలను సంబంధిత పోలీసు అధికారులు సందర్శించి, క్షేత్ర స్థాయిలో ప్రజలతో మమేకమవుతూ, వివిధ నేరాల నియంత్రణ పట్ల అవగాహన కల్పిస్తూ, గ్రామాల్లో పల్లె నిద్ర చేసి, వారి సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలకు మరింత చేరువ అవుతున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ సంబంధిత పోలీసు అధికారులు, అడాప్షన్ కానిస్టేబుళ్లు వారి పరిధిలోని గ్రామాల్లో నెలలో రెండు సార్లు పల్లె నిద్ర చేయాలని ఆదేశించామన్నారు. ఇందులో భాగంగా పార్టీలకు అతీతంగా గ్రామస్థులతో మమేకం కావాలని, గ్రామ సమస్యలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే సమస్యల గురించి వారితో చర్చించి, గ్రామాల్లో ఎటువంటి వివాదాలు, అల్లర్లు జరగక్కుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించి, ప్రజలకు పోలీసు వ్యవస్థ పట్ల నమ్మకాన్ని పెంచాలన్నారు. గ్రామాల్లోకి వచ్చే కొత్త వ్యక్తులు, హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తుల నడవడికపై నిఘా పెట్టాలని, వారు జీవనం ఏవిధంగా సాగిస్తున్నది తెలుసుకోవా లన్నారు. ఈ మేరకు గ్రామాల్లోని బాలికల పాఠశాలలు, హాస్టళ్లలో భద్రతను సంబంధిత పోలీసు అధికారులు పర్యవేక్షిస్తున్నారని ఎస్‌పి తెలిపారు. గత రెండు నెలల్లో జిల్లాలో 10మంది సిఐలు, 30మంది ఎస్ఐలు 72 మంది గ్రామాల్లో ఇప్పటి వరకు పల్లెనిద్ర చేసి, గ్రామస్థులతో మమేకం కావడం వలన మంచి ఫలితాలు వస్తున్నాయని తెలిపారు.

ఎస్‌పి శైలజ, శుభలేఖ సుధాకర్ దంపతులకు

జీవిత సాఫల్య పురస్కారం

ప్రజాశకి-విజయనగరం కోట

ప్రముఖ చలన చిత్ర నటులు శుభలేఖ సుధాకర్ దంపతులకు ఈ ఏడాది శ్రీగురునారాయణ కళాపీఠం జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రకటించింది. ఈ మేరకు కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు బి.ఎ. నారాయణ గురువారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంబంధిత వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ 1న శ్రీ విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా శ్రీగురు నారాయణ కళాపీఠం నాల్గవ వార్షికోత్సవ వేడుకలను ఆనంద గజపతి ఆడిటోరియంలో 'స్వర సాగర సంగమం' పేరుతో నిర్వహించనున్నట్టు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్.పి.శైలజ, శుభలేఖ సుధాకర్ దంపతులకు జీవిత సాఫల్య పురస్కారం ప్రధానం చేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా పద్మభూషన్, గానకోకిల పి.సుశీలమ్మ హాజరవుతున్నట్టు తెలిపారు. ముఖ్య అతిథిగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రత్యేక అతిథిగా జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ప్రియ అతిథిగా స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్రకు చెందిన ప్రముఖ తబలా విద్వాన్ బగ్గాం ధనుంజయకు ప్రత్యేక అభినందన సత్కారం చేయనున్నట్టు తెలిపారు. మంగళవారం సాయంత్రం 4గంటలకు బి. పవన్, చరణ్ సంగీత సారధ్యంలో సంగీత విభావరి ప్రారంభమవుతుందని, అవార్డు గ్రహీత ఎస్.పి. శైలజ కూడా ఆలపించనున్నారని తెలిపారు. సమావేశంలో కళాపీఠం అధ్యక్షులు జి.సన్యాసమ్మ, యార్లగడ్డ బాబూరావు, కోశాధికారి బి. పద్మావతి, కార్యదర్శి బి.నాగేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి బి. వెంకటేష్, గాయని సురభి శ్రావణి పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు

- వడగాల్పులతో అల్లాడుతున్న జనం
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్య నిపుణులు

నిర్మానుష్యంగా మారిన కలెక్టరేట్ కూడలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వేసవి ప్రారంభంలోనే ఎండలు సలసలమంటున్నాయి. గత పదిరోజులుగా తీవ్రమైన ఎండలు, వడ గాల్పులతో బయట ప్రయాణాలు చేసే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 10 గంటలు దాటితే చాలు ఎండల వేడి పెరిగిపోతుంది. గత ఏడాది మార్చి ఈ సమయానికి ఎండల తీవ్రత అంతగా కనిపించలేదు. కానీ ఈ ఏడాది ఫిబ్రవరి నెలలోనే సాధారణ ఉష్ణోగ్రతల కంటే అధికంగా నమోదు అయ్యాయి. జిల్లాలోని కొన్ని మండలాల్లో 38 డిగ్రీల పైన ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ వేసవిలో ఉష్ణోగ్రతలు ఇంకా పెరిగే అవకాశం ఉంది. జిల్లాలో గత వారం రోజుల నుండి ఎండల తీవ్రత పెరుగుతోంది. మార్చి మొదటి వారంలోనే ఎండ వేడిమి తీవ్రత పెరగడంతో ప్రజలు అల్లాడి పోతున్నారు. బుధ వారం విజయ నగరంలో 38 డిగ్రీలు, శృంగవరపుకోట, కొత్తవలస మండలాల్లో 39, గజపతినగరంలో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా గురువారం విజయనగరంలో 39 డిగ్రీలు, కొత్తవలసలో 41, ఎస్.కోటలో 41, గజపతినగరంలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గత ఫిబ్రవరి నెలలో అత్యధికంగా 37 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదయింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ముందుగానే ఎండల వేడిమి ఉష్ణోగ్రతలు పెరగడం ప్రారంభ మయ్యాయి. ఈ ఉష్ణోగ్రతల తీవ్రత ఏప్రిల్, మే నెలల్లో మరింత తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉందని వాతావరణ విపత్తుల శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఎండ వేడిమి తీవ్రరూపమై వడ గాల్పులు వీచే ప్రభావం ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఎండల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగు చర్యలు తీసుకోవాలని, చలి - వేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులు సూచిస్తున్నారు. ఎండలు ఎక్కువ అవుతుండడంతో ప్రజలు శీతాల పానీయాల వైపు మొగ్గు చూపుతున్నారు.

అధికారుల సూచనలు

ఎండల తీవ్రత నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. వ్యవసాయ కూలీలు 12 గంటలలోపు పనులు ముగించుకొని ఇళ్లకు చేరుకోవాలి. పనులకు వెళ్లేవారు మజ్జిగ, తాగునీరు వెంట తీసుకెళ్లాలి. ఉపాధి పనుల్లో కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలి, వద్ధులు, పిల్లలు అవసరం ఉంటే తప్ప బయట తిరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కాటన్, లూజు దుస్తులు, టోపీలు వాడాలి. వడదెబ్బకు గురయితే వెంటనే ఆశాలకు, ఎఎన్ఎంలకు సమాచారం ఇచ్చి ప్రాథమిక చికిత్స తీసుకోవాలి.

ట్రూఅప్ ఛార్జీలను రద్దుచేయాలి

నేడు విద్యుత్ కార్యాలయం వద్ద సిపిఎం ధర్నా

ప్రజాశకి-విజయనగరం టౌన్

సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలని, అదానీతో చేసుకున్న సెకీ విద్యుత్ ఒప్పందం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న విద్యుత్ కార్యాల యాల వద్ద ధర్నాలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు పిలుపునిచ్చారు. 'విద్యుత్ సాకులు' అనే పుస్తకాన్ని విజయనగరం కోట వద్ద కార్మికులతో కలిసి గురువారం విడుదల చేశారు. ఈ సందర్బంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం ఎటువంటి విద్యుత్ ఛార్జీలూ పెంచబోమని ట్రూఅప్ ఛార్జీలు పేరుతో ఇప్పటికే 17వేల కోట్ల రూపాయలు ప్రజలపై భారాలు వేసిందని తెలిపారు. మళ్లీ తాజాగా సెకీ ఒప్పందం ప్రకారం విద్యుత్ భారాలు ప్రజలపై వేయడం దుర్మార్గమని తక్షణమే, తక్షణమే సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనేపథ్యంలో శుక్రవారం విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆరో తరగతి విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మోడల్ స్కూళ్లలో ఆరో తరగతి నుండి బాలికలకు వసతి సౌకర్యం కల్పించాలని మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ తహీరా సుల్తానాకు ఎపిటిఎఫ్‌జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ బుకారిబాబు, పి.శ్రీనివాస్ వినతి అందజేశారు. మోడల్ స్కూల్ లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ విడుదల చేయాలని, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు కాకుండా రెగ్యులర్ ఉద్యోగులను నియమించాలని కోరారు. ఎన్‌సిఇఆర్ టి లో డిప్యుటేషన్ కు మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు అర్హత కలిగిన వారికి అవకాశం కల్పించాలని కోరారు.

ఫ్యాప్టో జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అభివాదం చేస్తున్న ఫ్యాప్టో నూతన కార్యవర్గ సభ్యులు

ఫ్యాప్టో జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. నగరంలోని యూత్ హాస్టల్‌లో రాష్ట్ర పరిశీలకులు ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ ఎస్.చిరంజీవి సమక్షంలో జిల్లా ఫ్యాప్టో సమావేశం గురువారం జరిగింది. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ బండి మహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సెక్రటరీ జనరల్ సిహెచ్ వెంకటరమణ రిపోర్టును ప్రవేశపెట్టారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా పి.శ్రీనివాస్ (ఎపిటిఎఫ్), కో చైర్మన్‌గా లోపింటి శివ ప్రసాద రావు (ఎస్‌సి, ఎస్‌టియుఎస్), డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా జెఎవిఆర్‌కె ఈశ్వరరావు (యుటి ఎఫ్), ఎం వి పైడిరాజు (ఎపిటిఎఫ్1938), కార్యదర్శిగా వంకర రమణ (ఆప్టా) ఎన్నికయ్యారు.

అనంతరం నూతనంగా ఎన్నికైన సభ్యుల చేత రాష్ట్రపరిశీలకులు ఎస్.చిరంజీవి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని, 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, డిఎ బకాయిలు, పిఆర్‌సి బకాయిలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో ఎపి టి ఎఫ్ 1938 రాష్ట్ర నాయకులు సదాశివరావు, డి.ఈశ్వరరావు, ఎస్ టియు రాష్ట్ర నాయకులు డి.శ్యామ్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు, ఎపి టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ బుకారిబాబు, ఎస్‌టియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.జోగారావు, సిహెచ్. సూరిబాబు, ఎపిటిఎఫ్ 1938 జిల్లా అధ్యక్షులు ఎం.బలరాం నాయుడు, వెంకట శ్రీనివాస్, జిల్లా ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎం.అప్పారావు, ఆప్టా జిల్లా నాయకులు భాస్కరరావు, ఎస్‌టియు నాయకులు గోవిందరావు, అప్పారావు, ఎస్ఎస్ దొర తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కబడ్డీ పోటీలకు

అనురాధ, సుమంత్ ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 28 నుండి 31 వరకు బీహార్ రాష్ట్రంలో జరగబోయే జాతీయ సబ్‌జూనియర్ బాల, బాలికల ఛాంపియన్‌షిప్‌కు జిల్లాకు చెందిన ఎం. అనురాధ, ఇ.సుమంత ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులకు జిల్లా కబడ్డీ సంఘం ఛైర్మన్ ఐవిపి రాజు, అధ్యక్ష, కార్యదర్శులు, ఎ. రంగారావుదొర, కెవి ప్రభావతి ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మణరావు, పీడీ సౌధమణి అభినందనలు తెలిపారు.

ఆప్కో చేనేత వస్త్రాలపై ప్రత్యేక ఆఫర్లు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం సరి కొత్త వస్త్రాలపై 30శాతం డిస్కౌంట్, ఎంపిక చేసిన చేనేత వస్త్రాలపై 45శాతం డిస్కౌంట్ ను ఇస్తున్నట్లు ఆప్కో విజయనగరం మండల వాణిజ్య అధికారి బి. హరి ప్రసాద రావు ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం జిల్లాలోని అన్ని ఆప్కో విక్రయ శాలలు గంటస్తంభం, ఎంజి రోడ్డులోగల చేనేత వస్త్రాలయం, చీపురుపల్లి పట్టణంగల ఆప్కో విక్రయ శాలల్లో ఈ ఆఫర్లు అందించనున్నట్లు తెలిపారు. రాజమండ్రి, బందరు, వెంకటగిరి, మాధవరం, చీరాల, ఉప్పాడ చీరలు, షర్టింగ్, దోవతులు, దుప్పట్లు, లుంగీలు, టవల్స్, రెడీమేడ్ షార్ట్స్ మరియు డ్రెస్ మెటీరియల్స్ మొదలగు చేనేత వస్త్రాలు కొనుగోలు చేసి చేనేత వస్త్ర పరిశ్రమను ప్రోత్సహించి చేనేత కార్మికులను ఆదరించాలని కోరారు.

ఉగాది వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి

ప్రజాశక్తి-విజయనగరం

శ్రీ విశ్వావసునామ ఉగాది వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి కోరారు. ఉగాది వేడుకల నిర్వహణపై తమ ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సూచనల మేరకు ఈనెల 30న ఉగాది వేడుకలను కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించ నున్నట్లు తెలిపారు. తెలుగువారి సంప్రదాయం ఉట్టిపడే విధంగా మామిడాకుల తోరణాలు, అరటి చెట్లతో అలంకరణలు చేయాలని సూచించారు. ఉగాది పంచాంగ శ్రవణం, వేదాశీర్వచనం, ప్రసాదాల ఏర్పాట్లను దేవాదాయశాఖ నిర్వహించాలని ఆదేశించారు. ఉగాది పచ్చడిని స్త్రీశిశు సంక్షేమశాఖ పంపిణీ చేయాలని సూచించారు. వేదిక అలంకరణ బాధ్యతలను ఉద్యానశాఖకు, వేదికపై బ్యాక్ డ్రాప్ ఏర్పాటును పర్యాటక శాఖకు అప్పగించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణను సంగీత కళాశాలకు అప్పగించారు. అప్పగించిన విధులను అన్ని శాఖలు సమర్ధవంతంగా నిర్వహించి, వేడుకలను విజయవంతం చేయాలని డిఆర్ఓ కోరారు. సమావేశం అనంతరం ఆడిటోరియంను పరిశీలించారు. సమావేశంలో సమాచార పౌర సంబంధాల శాఖ ఎడి డి.రమేష్, ప్రభుత్వ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ శాస్త్రి, జిల్లా పర్యాటక శాఖాధికారి కుమారస్వామి, కలెక్టరేట్ ఎఒ దేవ్ ప్రసాద్, తాహాశీల్దార్ కూర్మనాథ్, ఆయా శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపయోగపడని భూ సర్వే ఎందుకు?

- సమస్యలు పరిష్కరించాలని రైతుల విన్నపాలు
- కలెక్టర్‌కు ఫిర్యాదుతో అంబకండిలో ఆర్‌డిఒ గ్రామసభ



గ్రామసభలో అధికారులను ప్రశ్నిస్తున్న రైతు

ప్రజాశక్తి- రేగిడి

ఉపయోగపడని భూ రీసర్వేలు మాకెందుకని అంబఖండి గ్రామానికి చెందిన రైతులు చీపురుపల్లి ఆర్‌డిఒ సత్యవాణి ముందు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్ స్పందనలో రైతులు జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ గ్రామంలో భూ రీ సర్వే వద్దని కోరారు. రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ స్పందించి చీపురుపల్లి ఆర్‌డిఒ సత్యవాణికు పూర్తిస్థాయిలో గ్రామసభలు నిర్వహించి, రైతులకు భూ సర్వేపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆర్‌డిఒ గ్రామాన్ని సందర్శించి సచివాలయంలో రైతులకు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు భూ రీ సర్వే తమకు వద్దు అంటూ ఆర్‌డిఒకు విన్నవించారు. ఏ రైతు సాగులో భూమి ఉంటే ఆ రైతుకు మ్యుటేషన్ ప్రక్రియ చేసి భూ దస్త్రాలు ఇప్పించాలని రైతులు కోరారు. భూ రీ సర్వే పై ఎన్నో సమస్యలు వస్తున్నాయని, అందుకు భూ రీ సర్వే కాకుండా పాస్ పుస్తకాలు, టైటిల్, వన్ బి భూ దస్త్రాలు ఆధారంగా ఎప్పటిలాగే మ్యుటేషన్ చేసి ఎవరి భూములు వాళ్లకి సరిచేసి పట్టాలు ఇవ్వాలని రైతులు కోరారు. గ్రామ క్రైయి సీట్లు, దస్త్రాల్లో నమోదు కాని భూ సర్వే నంబర్లు, ఒక రైతు భూమి వేరొక రైతు వన్‌బిలో పేరు ఉంటే ఎన్‌ఒసిలు, పంచనామా, గ్రామ పెద్దల సమక్షంలో ఒప్పందం పత్రాలు ఇస్తామని చెప్పారు.

ఆర్‌డిఒ రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు భూ రీసర్వే ఉంటుందని తెలిపారు. ఎటువంటి ఇబ్బందులూ లేకుండా సజావుగా భూ రీసర్వే చేసి, వాటిని ప్రక్షాళన చేసి ఖచ్చితమైన విస్తరణతో కొత్త పాస్ పుస్తకాలు అందజేసేందుకు బాధ్యత తీసుకుంటామన్నారు. ఏది ఏమైనా రైతు వద్ద ఉన్న భూ దస్త్రాలు, పాస్ పుస్తకాలు ప్రాప్తికి నికరమైన విస్తరణ బట్టి కొత్తవి మంజూరు చేస్తామన్నారు. రైతులకు ఎటువంటి సమస్య లేకుండా పట్టాలు అందజేస్తామని చెప్పారు. భూ సర్వే తప్పునిసరిగా చేస్తామని, ఈ సర్వేలో ప్రతి రైతు సహకరించాలని కోరారు.

ఈ గ్రామ సభలో తహాశీల్దార్ ఎన్. చిన్నారావు, డిఎల్ఎస్ఒ కే.రమణమూర్తి, సర్పంచ్ లక్ష్మిగోవింద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా తొలగిస్తారా?

మేమే జోక్యం చేసుకోవాలా?

- ఆక్రమణదారులకు తహాశీల్దార్ హెచ్చరిక
- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-వేపాడ



ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న తహాశీల్దార్ రాములమ్మ

స్వచ్ఛందంగా చెరువు ఆక్రమణలు తొలగిస్తారా? లేకుంటే తామే జోక్యం చేసుకుని తొలగించాలా? అని తహాశీల్దార్ రాములమ్మ.. ఆక్రమణదారులను హెచ్చరించారు. వేపాడలో చెరువు ఆక్రమణపై గురువారం 'కబ్జాలు చేసినా పట్టించుకోరా' పేరుతో 'ప్రజాశక్తి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం తహాశీల్దార్ ఆక్రమణకు గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. రెండు చెరువుల మధ్య గట్టుపై ప్రయివేటు పాఠశాలకు నిర్మించిన సిసి రోడ్డును పరిశీలించి, ఆక్రమణకు గురైన స్థలాన్ని గుర్తించి, హద్దులు కూడా నిర్ధారించారు. అనుమతులు లేకుండా పక్కా నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు ఇస్తామని తహాశీల్దార్ తెలిపారు. స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకుంటే మంచిదని, లేదంటే జెసిబితో తొలగిస్తామని హెచ్చరించారు. ఈ పరిశీలనలో మండల సర్వేయర్, ఎంఆర్ఐ, సచివాలయ సర్వేయర్, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు గుమ్మడి భారతి పాల్గొన్నారు.

వైసిపికే వైస్ ఎంపిపి పదవి

- ఏకగ్రీవంగా ఎన్నికైన నాగలక్ష్మి • సంఖ్యా బలం లేక గైర్హాజరైన కూటమి ఎంపిటిసిలు

ప్రజాశక్తి - భోగాపురం

మండల పరిషత్ వైస్ ఎంపిపి పదవి మళ్లీ వైసిపికే దక్కింది. ఆ పార్టీ నుంచి ఒకే ఒక నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవమైంది. తగినంత సంఖ్యాబలం లేకపోవడంతో కూటమి ఎంపిటిసిలు ఈ ఎన్నికకు గైరాజరయ్యారు. భోగాపురం-1 ఎంపిటిసి పచ్చిపాల నాగలక్ష్మి వైస్ ఎంపిపిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ ఎంపిపిగా ఉన్న పడాల సత్యవతి ఇటీవల రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరడంతో మళ్లీ వైస్ ఎంపిపి ఎన్నికను గురువారం ఎన్నికల అధికారి వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం 10 గంటల లోపు నామినేషన్ వేయాల్సి ఉండడంతో వైసిపి ఎంపిటిసిలు చేరుకుని నాగలక్ష్మితో నామినేషన్ వేయించారు. ఒకే ఒక్క నామినేషన్ దాఖలు కావడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. గెలిచినట్లు ధ్రువపత్రం అందజేసి అనంతరం ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. వైసిపికి 9 మంది ఎంపిటిసిలు ఉండడంతో, తగినంత సంఖ్యాబలం లేకపోవడంతో కూటమి పార్టీలో ఉన్న ఏడుగురు ఎంపిటిసిలు గైర్హాజరయ్యారు. ఎమ్మెల్సీ పి.సురేష్ బాబు, ఎంపిడిఒ గాయత్రి, తహశీల్దార్ ఎం సురేష్, ఎఒ కామేశ్వరరావు,సీనియర్అసిస్టెంట్ చిన్నారావు పాల్గొన్నారు.

వైస్ ఎంపిపికి ఘన సన్మానం

వైస్ ఎంపిపిగా ఎన్నికైన పచ్చిపాల నాగలక్ష్మిని మండల వైసిపి అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, ఎంపిపి అనూష రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, సర్పంచులు, ఎంపిటిసిలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మరో వైస్ ఎంపిపి రావాడ బాబు, ఆ పార్టీ నాయకులు కర్రోతు వెంకటరమణ, ఏ పైడినాయుడు, వాసుపల్లి రెయ్యుడు, బైరెడ్డి రమణ, డిబి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూతిక పేట ఉపసర్పంచ్‌గా రమణ

నెల్లిమర్ల: మండలంలోని పూతికపేటలో గురువారం పంచాయతీ కార్యాలయంలో ఇఒపిఆర్‌డి శంకర జగన్నాధం, పంచాయతీ కార్యదర్శి వి.అనూష ఆధ్వర్యంలో ఉపసర్పంచ్ ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో మొత్తం 8 మంది వార్డు సభ్యులుండగా సర్పంచ్‌తో బాటు నలుగురు వార్డు సభ్యులు హాజరై తాళ్ల పూడి రమణను ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయనకు ధ్రువ పత్రాన్ని అందించారు. సర్పంచ్ లెంక మంగమ్మ, వైసిపి నాయకులు లెంక గోవిందరావు తదితరులు ఉపసర్పంచ్‌ని అభినందించారు.

శ్యామాయవలస ఉపసర్పంచ్‌గా బొత్స శ్రీదేవి

మెరకముడిదాం: మండలంలోని శ్యామాయవలస గ్రామ ఉప సర్పంచ్‌గా బొత్స శ్రీదేవి ఏక గ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి సుధాకర్ పట్నాయక్ తెలిపారు. గురువారం నిర్వహించిన గ్రామ ఉపసర్పంచ్ ఎన్నికలలో బొత్స శ్రీదేవి ఒక్కరే పోటీలో నిలబడగా ఆమెను ఏక గ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించి ఆమెకు ధ్రువీకరణ పత్రానిన అందించారు. దీంతో ఎప్పటి నుండో ఖాళీగా ఉండిపోయిన ఉపసర్పంచ్ పదవిని వైసిపి తన ఖాతాలో వేసుకుంది.

డెంకాడ: నారాయణమ్మకు ధ్రువపత్రం అందజేస్తున్న ఇఒపిఆర్‌డి

భోగాపురం: వైస్‌ఎంపిపి నాగలక్ష్మిని సత్కరిస్తున్న వైసిపి నాయకులు

ఉపసర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం

డెంకాడ : మండలంలోని గుణుపూర్ పేట ఉప సర్పంచ్‌ను వార్డు సభ్యులు ఏకగ్రీవంగా గురువారం ఎన్నుకున్నారు. ఇక్కడ ఉప సర్పంచ్‌గా ఉన్న బడ్డుకొండ చిన్న రాజీనామా చేయడంతో ఉప సర్పంచ్ ఎన్నిక అనివార్యమైంది. గ్రామ సచివాలయంలో ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించారు. వార్డ్ మెంబర్ లందరూ ఏడవ వార్డు సభ్యులు వాకాడ నారాయణమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి మహమ్మద్ హిదాయత్ పాష వ్యవహరించారు. ఉప సర్పంచ్‌గా ఎన్నికైన నారాయణమ్మకు ఎంపిడిఒ వై. భవాని, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావులు ధ్రువపత్రాన్ని అందజేశారు. ఉప సర్పంచ్‌గా ఎన్నికైన నారాయణమ్మను సర్పంచ్ పైలముత్యాలరావు, వార్డు సభ్యులు ఘనంగా సన్మానించారు.

సంతకాలు చేస్తున్న ప్రజలు

ఆప్కాస్ రద్దుకు వ్యతిరేకంగా సంతకాలు సేకరణ

ప్రజాశక్తి-బొబ్బిలి

ఆప్కాస్‌ను రద్దు చేసి, ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన గురువారం పట్టణంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు, ఫెడరేషన్ అధ్యక్షులు జి.గౌరి, కార్యదర్శి జె.శంకర్రావు మాట్లాడుతూ పాతికేళ్లుగా మున్సిపాలిటీలో కార్మికులు పారిశుధ్య పనులు చేస్తున్నారని, వీరి సేవలతో పట్టణమంతా శుభ్రంగా ఉంటోందని చెప్పారు. ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్న వీరికి కనీస వేతనాలు, ఇతర సౌకర్యాలు కల్పించడం లేదని, ఏళ్ల తరబడి రెగ్యులర్ చేయడం లేదని తెలిపారు. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతుంటే, ఆప్కాస్‌ను రద్దు చేసి, వారిని ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించి, శ్రమ దోపిడీకి పాల్పడాలని చూడటం దారుణమన్నారు.

రూ.2.01 లక్షలకు ఆశీల వేలం

ప్రజాశక్తి-గజపతినగరం

గజపతినగరం సచివాలయ ఆవరణలో గురువారం ఆశీల వేలం నిర్వహించారు. వేలంలో ఐదుగురు పాల్గొనగా, బూర్లె లక్ష్మి రూ.2.01 లక్షలకు ఆశీల వేలం కైవశం చేసుకున్నట్లు ఇఒపిఆర్‌డి సుగుణాకరరావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నరవ కొండమ్మ, ఇఒ టి.జనార్ధనరావు పాల్గొన్నారు.

సర్వేలు పరిశీలన

ప్రజాశక్తి- రాజాం

మండలంలోని పొగిరి సచివాలయం పరిధిలో జరుగుతున్న పలు సర్వేలను ఎంపిడిఒ శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. హౌస్ హెూల్డ్ సర్వే, సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల సర్వే, చైల్డ్ ఆధార్ నమోదు వర్క్ ఫ్రమ్ హెూమ్ సర్వేలను పరిశీలించారు. అనంతరం సచివాలయం సిబ్బందితో కలిసి ఎస్‌డబ్ల్యుపి షెడ్‌లను పరిశీలించారు. హౌస్ టాక్స్ కలెక్షన్, సిబ్బంది సమయపాలన సక్రమంగా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని అరిగిపాలెం, సింగరాయి పాఠశాలలను ఎంఇఒలు పి.బాలభాస్కరరావు గురువారం సందర్శించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, టాయిలెట్లు, వంటగది, తాగునీరు, కిచెన్ గార్డెన్ పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీష్ చదివించడం, రాయించడం, చతుర్విధ ప్రక్రియలు చేయించడంతోపాటు వర్క్‌బుక్స్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

శ్మశానవాటికలో రోడ్డు, షెడ్డు నిర్మించాలి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ వెనుక ఉన్న శ్మశానవాటికలో రోడ్డు, దహన సంస్కారాలు నిర్వహించేందుకు అదనపు షెడ్డు నిర్మించాలని వార్డు సభ్యులు చిప్పాడ శేషగిరి కోరారు. పట్టణ నడిబొడ్డున ఉన్న శ్మశానవాటికకు ఒక్కో రోజు మూడు, నాలుగు మృతదేహాలు వస్తుంటాయని చెప్పారు. దహన సంస్కారాలు చేసేందుకు రెండు షెడ్లు మాత్రమే ఉండటంతో మిగతా వారు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. శ్మశాన వాటికలో సిసి రోడ్డు నిర్మాణం కొంత భాగం నిర్మించాల్సి ఉందని చెప్పారు.

సారా నివారణకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

సారా నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు చెప్పారు. మండలంలోని కొయ్యకొండవలస, నిమ్మలపాడులో గురువారం నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. సారా వల్ల కలిగే అనర్థాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. నాటుసారా తాగడం వల్ల ఆరోగ్యం క్షీణిస్తుందని, దీనికి దూరంగా ఉండాలని కోరారు. సారా తయారు చేసినా, అమ్మినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది, గిరిజనులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ సభ్యులకు విగ్రహాల వడ్డాణాలను అందజేస్తున్న మాజీ ఎంపి ఝాన్సీలక్ష్మి

సీతాదేవి, లక్ష్మీదేవి విగ్రహాలకు వడ్డాణాలు బహూకరణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

వచ్చేనెల 6న తోటపాలెంలోని రామాలయంలో జరుగనున్న శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకొని సీతాదేవి, లక్ష్మీదేవి విగ్రహాలకు మాజీ ఎంపి బొత్స ఝాన్సీలక్ష్మి రెండు వడ్డాణాలను బహూకరించారు. ఆలయ కమిటీ సభ్యులు శ్రీరామనవమి ఉత్సావాలకు కోరుతూ ఝాన్సీలక్ష్మికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామనవమి గోడపత్రికను ఆమె ఆవిష్కరించారు. అనంతరం వడ్డాణాలను కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో తోటపాలెం ఆలయ కమిటీ సభ్యులు ఆర్లె కృష్ణారావు, పతివాడ సత్యనారాయణ, అప్పలనారాయణ, గురునాథరావు, అప్పలనాయుడు, రామకృష్ణ, చందక రాము, ఆలయ పూజర్లు రమణమూర్తి పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సత్కారం

ప్రజాశక్తి-కొత్తవలస

ఉత్తమ సేవలకు గాను ఇటీవల డిఎంహెచ్ఒ నుంచి అవార్డులు స్వీకరించిన హెల్త్ అసిస్టెంట్ ఎల్.సత్యారావు, ల్యాబ్ టెక్నీషియన్ సంతోష్‌ను వియ్యంపేట పిహెచ్‌సిలో వైద్యాధికారులు గోపాలకృష్ణ, సింహాద్రినాయుడు గురువారం సత్కరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

రూ.40 లక్షలకు మార్కెట్ వేలం

ప్రజాశక్తి-రామభద్రపురం

రామభద్రపురం కూరగాయల మార్కెట్ వేలం రూ.40 లక్షలకు ఖరారైంది. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు అధ్యక్షతన వేలం నిర్వహించారు. పూడి సూర్యనారాయణ రూ.40,92,300కు వేలంలో దక్కించుకున్నారు. గతేడాది కూడా ఆయనే వేలంలో కైవశం చేసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారి వెంకటరమణ, ఇఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీజ్ చేసిన మద్యం ధ్వంసం

ప్రజాశక్తి-గజపతినగరం

సీజ్ చేసిన 553 మద్యం సీసాలను గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ధ్వంసం చేశారు. ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎఎస్ దొర సమక్షంలో వాటిని నిర్వీర్యం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బిసి కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో శుక్రవారం బిసి కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ నుంచి రుణాలకు 503 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. వారంతా ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్యాలయానికి అన్ని సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. ఇంటర్వ్యూ తర్వాత అర్హుల జాబితా వెల్లడిస్తామని చెప్పారు.

రామభద్రపురం : బిసి, ఇబిసి కార్పొరేషన్ల రుణాలకు శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ రత్నం తెలిపారు. దరఖాస్తుదారులు అన్ని పత్రాలతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు.

నేడు, రేపు బిసి రుణాలకు లబ్ధిదారుల ఎంపిక

విజయనగరం టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ మహిళల కోసం బిసి రుణాలు అందించేందుకు నిర్ణయించిన మేరకు శుక్ర, శనివారాల్లో రాజీవ్ స్టేడియంలో ఎంపిక నిర్వహిస్తునఏనట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య గురువారం తెలిపారు. శుక్రవారం 1 నుంచి 30 డివిజన్ల వారికి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, శనివారం 31 నుంచి 50వ డివిజన్ల వారికి ఉదయం 10:30 గంటల నుంచి 2గంటల వరకు ఎంపిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో 366 యూనిట్లను మంజూరు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ మేరకు 2,820 దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు.

బిసి కార్పొరేషన్ రుణాల దరఖాస్తుల పరిశీలన

గజపతినగరం : శుక్ర, శనివారాల్లో బిసి కార్పొరేషన్ రుణాల దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు ఎంపిడిఒ బి.కళ్యాణి తెలిపారు. మండలంలో ఒబిఎంఎంఎస్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకున్న 530 మంది దరఖాస్తుదారులకు సచివాలయాల వారీగా బ్యాంకర్ల సమక్షంలో రెండు రోజులపాటు వెరిఫికేషన్ జరుగుతుందని చెప్పారు.

బిసి కార్పొరేషన్ రుణ లబ్ధిదారుల ఎంపిక

నెల్లిమర్ల : మండలంలో బిసి కార్పొరేషన్ రుణ లబ్ధిదారులు ఎంపిక జరుగుతున్నట్లు ఎంపిడిఒ కె.రామకృష్ణరాజు తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 28న, ఏప్రిల్2న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బిసి కార్పొరేషన్ రుణ లబ్ధిదారులు ఎంపిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బిసి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారు బ్యాంకు అధికార్ల సమక్షంలో లబ్ధిదారులు ఎంపిక చేస్తామన్నారు. లబ్ధిదారులు దరఖాస్తుతో బాటు కుల, ఆదాయం ధృవీకరణ పత్రాలు, బియ్యం కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకంతో హాజరు కావాలని కోరారు. నగర పంచాయతీలో ఈ నెల 29న బైరెడ్డి సూర్యనారాయణ కల్యాణ మండపంలో లబ్ధిదారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కె. అప్పలరాజు తెలిపారు.

అనర్హులకు గోకులాలు ఎలా ఇస్తారు?

ఎపిఒను నిలదీసిన పిండ్రంగివలస గ్రామస్తులు

ప్రజాశక్తి-బాడంగి

అర్హులను పక్కనపెట్టి అనర్హులకు గోకులాలు ఎలా మంజూరు చేస్తారని పిండ్రంగివలస గ్రామస్తులు ఎపిఒ విజయలక్ష్మిని నిలదీశారు. ఇటీవల మండలంలోని పిండ్రంగివలస గ్రామంలో అనర్హులకు గోకులాలు మంజూరు చేశారని ఆ గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఎపిఒ విజయలక్ష్మి.. గురువారం ఆ గ్రామంలో విచారణ చేపట్టారు. గ్రామంలో 11 మంది గోకులం పథకానికి దరఖాస్తులు చేశామని గ్రామస్తులు తెలిపారు. రెండు షెడ్లు మంజూరు చేశారని, అవి కూడా అనర్హులకు ఇవ్వడం ఏమిటని ఎపిఒను ప్రశ్నించారు. ఎపిఒ స్పందిస్తూ మండలంలోని ప్రతి గ్రామానికి రెండు షెడ్లు వచ్చాయని బదులివ్వగా, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. పక్కనే ఉన్న గ్రామంలో 28 గోకులాలు మంజూరు చేసి, మా గ్రామానికి రెండు మాత్రమే కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. సర్పంచ్ రావాడ గౌరమ్మ మాట్లాడుతూ పంచాయతీ తీర్మానించి ఇచ్చినా, అధికారులు ఇష్టారాజ్యంగా మంజూరు చేశారని మండిపడ్డారు. ఎపిఒపై ఫిర్యాదు చేస్తే, ఆమెను విచారణ కోసం ఎలా పంపిస్తారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

లక్ష్య సాధనకు నిరంతరం కష్టపడాలి

అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి

ప్రజాశక్తి - భోగాపురం

లక్ష్యసాధనకు విద్యార్థులు నిరంతరం కృషి చేయాలని అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బసవపాలెం సమీపంలో ఉన్న అవంతి రీసెర్చ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఆస్ట్ర 2క25 యాన్యువల్ డే సంబరాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ శక్తి సామర్థ్యాలను ఉపయోగించుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. క్రమశిక్షణతో మెలిగి మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ పి. గోవిందరావు మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులు, గురువుల నమ్మకాన్ని నిలబెట్టాలన్నారు. మంచి మార్కులను సాధించి ఉన్నత శిఖరాలకు వెళ్లాలన్నారు. జెఎన్‌టియు డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూషన్ జివికె బాబులు, శ్రీకాకుళం ట్రిబుల్ ఐటీ ప్రొఫెసర్ కెవిజిడి బాలాజీ, విప్రో లిమిటెడ్ లీడ్ కన్సల్టెంట్ సురేష్ కుమార్ తదితరులు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ చాలా ఉపయోగపడతాయన్నారు. ఎంఎన్‌సి కంపెనీలలో ఉద్యోగాలు సాధించాలంటే టెక్నికల్ స్కిల్‌తో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. యాన్యువల్ డే సందర్భంగా ప్రముఖ సినీ గాయకుడు ధనుంజయ పాడిన పాటలకు విద్యార్థులు నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో అవంతి సంస్థల ప్రతినిధి మొత్తంశెట్టి మహేష్, భీమునిపట్నం కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ మురళీకృష్ణ, హెచ్ మల్లేశం, కె.భాస్కరరావు, ఎఒ జి.అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాకు ఆటంకం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మధుపాడ పంపింగ్ లైన్ ద్వారా నీటి పంపిణీ జరుగుతున్న పైపు రామవరం వద్ద లీకు అయినందున నగరంలో కొన్ని ప్రాంతాల్లో నీటి పంపిణీకి ఆటంకం ఏర్పడిందని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల నగరంలోని 20,24,36,38,39 డివిజన్ల ప్రాంతాలలో నీటి పంపిణీకి ఆటంకం ఏర్పడిందని తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపడతున్నామని వెల్లడించారు. అంతవరకు ఇబ్బందులు కలిగిన ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను చేపడతామన్నారు.

బాధిత కుటుంబానికి జనసేన సాయం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని తిప్పలవలసలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక పూరిల్లు కాలిపోయిన విషయం తెలిసిందే. గురువారం మండలంలోని జనసేన నాయకులు బాధితులు పరామర్శించి బియ్యం ప్యాకెట్‌తో పాటు రూ.15వేలు నగదు అందజేశారు. ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆదేశాల మేరకు బాధితులను పరామర్శించామన్నారు. ప్రభుత్వం నుండి వారికి రావలసిన వాటిని ఇప్పించే ఏర్పాటు చేస్తామన్నారు. జనసేన నాయకులు పతివాడ శ్రీను, కోట్ల రఘు, బాలా అప్పలరాజు, గుడివాడ జమరాజు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా దేవి

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా డివిఎల్ దేవి నాలుగోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక కోర్టు ఆవరణలో ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది గాలి ఈశ్వరరావు ఆధ్వర్యాన ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా సత్యనారాయణ, కార్యదర్శిగా యేగిరెడ్డి గణేష్ నాయుడు, సంయుక్త కార్యదర్శిగా గవర కృష్ణ, కోశాధికారిగా ఎం.కృష్ణమూర్తి, లైబ్రరీ కార్యదర్శిగా బి.సన్యాసయ్య ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా జి.లత, వి.రాజేష్, ఆర్.కృష్ణమనాయుడు ఎంపికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సీనియర్ న్యాయవాదులు డి.ఎన్.రాజు, జి.మహేంద్ర, కె.మహేశ్వరరావు, ఎన్.శ్రీరామ్మూర్తి, ఎం.వి.ఎస్ గిరిబాబు అభినందించారు.

ఆతవ రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ఆతవ గ్రామానికి నిర్మిస్తున్న రోడ్డును ఎమ్మెల్యే ఇందుకూరి రఘురాజు గురువారం పరిశీలించారు. సిపిఎం, గ్రామస్తుల పోరాట ఫలితంగా, ఎమ్మెల్యే రఘురాజు చొరవ మేరకు ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులు రూ.1.25 కోట్లతో ఈ రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘురాజు, సిపిఎం నాయకులు చల్లా జగన్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సత్యవంతుడు, వైస్ ఎంపిపి ఈశ్వరరావు, సర్పంచి వేమన నాయుడు పాల్గొన్నారు.

చెడు అలవాట్లతో భవిష్యత్తు నాశనం

ప్రజాశక్తి- డెంకాడ

యువత చెడు అలవాట్లతో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు కోరారు. మండలంలోని జొన్నాడ వద్ద భూమాత లేఔట్‌లో ప్రైవేట్ హాస్టల్లో ఉన్న ఇంజనీరింగ్ విద్యార్థులకు బుధవారం రాత్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు ఏది మంచో ఏది చెడో అవగాహన తక్కువగా ఉంటుందన్నారు. విద్యార్థులు ఎక్కువగా క్రికెట్ బెట్టింగ్‌లతో జీవితాలు నాశనం చేసుకుంటున్నారని అన్నారు. దొంగతనాలు, మాదకద్రవ్యాలు, గంజాయి రవాణా వినియోగం వంటి వాటికి దూరంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

షాపులకు లీజు పత్రాలు అందజేత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంతంలో నిర్మించిన దుకాణాలను ఆయా లీజుదారులకు నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కె.అప్పలరాజు లీజు ఉత్తర్వు పత్రాలను గురువారం తన ఛాంబర్ లో అందజేశారు. మొత్తం 22 దుకాణాలను నగరపాలక సంస్థ నిర్మించింది. ఇందు లీజు నిమిత్తమై అక్టోబర్‌లో బహిరంగ వేలంపాట నిర్వహించారు. అందులో 21 షాపులకు లీజుపత్రాలను అందజేశారు. ఎస్టీ మహిళ క్యాటగిరీకి చెందిన ఒక దుకాణం మాత్రం మిగిలి ఉందని తెలిపారు.

పాఠశాలకు సామగ్రి వితరణ

ప్రజాశక్తి-కొత్తవలస

నిమ్మల పాలెం ప్రాథమికోన్నత పాఠశాలకు అదామి ఇండియా సంస్థ సిఎస్‌ఆర్ నిధులు రూ.4.80 లక్షలతో సామగ్రిని అందజేసింది. సంస్థ సేల్స్ హెడ్ గొంప పైడిపునాయుడు ఆధ్వర్యాన 25 బెంచీలు, ప్రింటర్, ఎల్‌ఇడి స్మార్ట్ ప్యానల్, స్పోర్ట్స్ కిట్, 25 మంది విద్యార్థులకు బెంచీలు తదితర సామగ్రిని గురువారం ఆ పాఠశాల హెచ్‌ఎం. జి.పార్వతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, ఎమ్మెల్యే లలిత కుమారి తల్లి గొంప సత్యవతి, సర్పంచ్ కె.నిర్మల సాయి, శ్రీను దంపతులు, ఎస్ఎంసి చైర్‌పర్సన్ లక్ష్మి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, అదామి ఇండియా సంస్థ సీనియర్ జనరల్ మేనేజర్ కె.అమర్‌నాథ్ రెడ్డి, ఎఆర్‌ఎం లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలకు అందజేసిన ఎల్‌ఇడి స్క్రీన్ వద్ద సంస్థ ప్రతినిధులు, హెచ్‌ఎం

తోటపల్లి కాలువ నీరు ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-బొబ్బిలి

తెర్లాం మండల రైతులకు తోటపల్లి కుడి కాలువ ద్వారా సాగునీరు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, మండల కన్వీనర్ ఎస్.గోపాలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. తెర్లాం మండలం మీదుగా తోటపల్లి కుడి ప్రధానకాలువ వెళ్తున్నా రైతులకు సాగునీరు అందడం లేదన్నారు. తోటపల్లి కాలువ నుంచి సతివాడ లింగయ్యచెరువుకు పిల్ల కాలువ ఏర్పాటు చేసి నీరందిస్తే, అక్కడి నుంచి ఐదు చెరువులకు ఛానళ్ల ద్వారా నీరు వెళ్లి, 1500 ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు. పిల్ల కాలువ ఏర్పాటుకు రూ.5 లక్షల వరకు మాత్రమే ఖర్చవుతుందన్నారు. ఎమ్మెల్యే బేబినాయన కలుగజేసుకుని పిల్ల కాలువ నిర్మించి, రైతులకు సాగునీరు అందేలా చూడాలని డిమాండ్ చేశారు.

బకాయిలు చెల్లించాలని 1న ఉపాధి కూలీల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధి హామీ బకాయి బిల్లులు తక్షణమే చెల్లించాలని కోరుతూ ఏప్రిల్ 1న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో కూలీలు, మేట్లు పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ. జగన్మోహన్‌రావు పిలుపునిచ్చారు. గురువారం దుప్పాడ, జొన్నవలసలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న చెరువులు వద్ద కూలీలను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 9 వారాలకు పైగా ఉపాధి బిల్లులు బకాయిలు ఉన్నాయని తెలిపారు. నెలల తరబడి ఉపాధి హామీ బిల్లులు చెల్లించకపోవడంతో కూలీలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కుటుంబానికి రెండు వందల రోజులు పని, రోజు కూలి 600 చెల్లించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 1న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు సిఐటియు మద్దతిస్తుందని తెలిపారు.

'ఉపాధి' బకాయిలు చెల్లించాలి

బాడంగి : ఉపాధి హామీ కూలీలకు 10 వారాలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శి ఎ.సురేష్ అధికారులను డిమాండ్‌చేశారు. గురువారం మండలంలోని పూడివలస గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడారు. 10 వారాలు బిల్లులు పడటం లేదని, కూలి గిట్టుబాటు కావడం లేదని కూలీలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వారం రోజులు పని చేస్తే మూడు రోజులకే మస్టర్లు వేస్తున్నారని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండు పూటలా పనిని రద్దు చేసి, ఒకేపూట చేయించాలని డిమాండ్‌చేశారు. పనిప్రాంతాల్లో తాగునీరు, టెంట్లు ఏర్పాటుచేయాలని కోరారు.

ఉపాధ్యాయుడు బంగారయ్యకు సత్కారం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

తంగుడుబిల్లి జడ్‌పి ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయులు శివకు బంగారయ్యను పాఠశాలలో తోటి ఉపాధ్యాయులు గురువారం ఘన సత్కారం చేశారు. పేరెంట్స్ టీచర్స్ కమిటీ చైర్మన్ పల్లి శ్రీను, హెచ్‌ఎం రొంగళి సత్యం, ఉపాధ్యాయ సిబ్బంది, పిల్లలు కలిసి బంగారయ్యను ఘనంగా సత్కరించారు. ఇటీవల బంగారయ్యకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ రత్న అవార్డును అందుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన్ను గ్రామస్తులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ చైర్మన్ పల్లి శ్రీను మాట్లాడుతూ బంగారయ్య మాస్టారు విద్యార్థుల ఉన్నతికి చేసిన కృషి, సేవా దృక్పథమే ఉన్నత స్థితికి చేర్చిందన్నారు. హెచ్‌ఎం సత్యం మాట్లాడుతూ తమ పాఠశాల గణిత ఉపాధ్యాయులు బంగారయ్య అంచెలంచెలుగా ఎదుగుతూ ఎన్నో అవార్డులు తీసుకోవడం హర్షనీయమన్నారు.

ఉపాధ్యాయుడు బంగారయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు

ఘనంగా రామ్‌చరణ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గ్లోబల్‌స్టార్ రామ్‌చరణ్ జన్మదిన వేడుకలు గురవారం రామ్ చరణ్ యువశక్తి, జనసేన పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక విజయ బ్లడ్ బ్యాంక్‌లో జిల్లా రాంచరణ్ యువశక్తి టీం ప్రతినిధులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జనసేన నాయకులు గురాన అయ్యలు మాట్లాడుతూ మెగాస్టార్ తనయుడిగా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టినప్పటికీ.. తనకంటూ ప్రత్యేకమైన ఫ్యాన్ ఫాలోయింగ్ సొంతం చేసుకున్నారన్నారు. సేవా రంగంలో కూడా తండ్రిని ఆదర్శంగా తీసుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు.

నవోదయలో సత్తాచాటిన విద్యార్థులు

ప్రజాశక్తి- పూసపాటిరేగ

జవహర్ నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష 2025 ఫలితాల్లో స్థానిక ఎపి ఇనిస్టిట్యూట్ విద్యార్థులు సత్తా చాటారు. ఇనిస్టిట్యూట్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు నవోదయ ఆరవ తరగతికి ఎంపికైనట్లు ఇనిస్టిట్యూట్ కరస్పాండెంట్ అట్టాడ అప్పలనాయుడు తెలిపారు. భోగాపురం మండలం నందిగాంకు చెందిన జి.దిలీప్, సవరవిల్లి గ్రామానికి చెందిన బి.జ్ఞాన స్వరూప్ రెడ్డి, ఆవాల నందిగామకు చెందిన జి. ప్రవణ్య, పూసపాటిరేగ మండలం కొప్పెర్లకు చెందిన డి.ఎస్తేరు, తెలంగాణ రాష్ట్రం హనుమకొండకు చెందిన కె.సుదంవి ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరిచారన్నారు. తమ ఇనిస్టిట్యూట్ స్థాపించి ఏడాదిలోనే నవోదయలో ప్రవేశ సీట్లు దక్కించుకొని సత్తా చాటారనీ తెలిపారు. సమ్మర్ కోచింగ్ ప్రారంభమైందని 45 రోజులు పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు.

విక్టరీ చూపుతున్న ఎపి ఇనిస్టిట్యూట్ కరస్పాండెంట్, విద్యార్థులు